క్లుప్తంగా

విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దు

తహసీల్దార్ నగేష్

గురజాల : బీఎల్‌వోలు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని పోలింగ్ బూత్‌ల పరిధిలో 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ఓటరు జాబితాలో నమోదు అయిన ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉన్న యెడల మార్పులు చేర్పులు చేసుకునే విధంగా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. మృతి చెందిన ఓటర్లు ఉంటే వారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



మాచర్ల : పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నారాయణ, కృష్ణవేణి టాలెంట్, పీఆర్ఎస్ విద్యా సంస్థలు, పల్నాడు జూనియర్ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాల, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా రాఖీ పండుగ జరుపుకున్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



మాచర్ల : పట్టణంలోని బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరవుతున్న 70 మంది విద్యార్థులకు రూ.19 వేలు విలువ చేసే మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. బిగ్ హెల్ప్ సంస్థ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భాస్కర్‌బాబు, ఫౌండర్ మొహమ్మద్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాలుగా విద్యార్థులకు సహాయం అందజేస్తున్నారు. విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ షకీనా, ఉపాధ్యాయులు ఎం.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది సేవలకు అభినందనలు



గురజాల : ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ స్తంభాలపై పింగాణీలు కాలిపోవడంతో పాటు విద్యుత్ వైర్లు తెగి కిందపడిపోవడం వలన సుమారు సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం కురుస్తున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది పెట్రోలింగ్ చేసి సమస్య పరిష్కారానికి.. రాత్రి 12 గంటల వరకు పని చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో విద్యుత్ సిబ్బందిని పలువురు విద్యుత్ వినియోగదారులు అభినందించారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ మాసోత్సవాలు

అచ్చంపేట: జాతీయ పశు వ్యాధి నియంత్ర పథకం – గాలి కుంటు వ్యాధి మాసోత్సవాలలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పశు వైద్య, రైతు సేవా కేంద్రాలలో వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. గాలి కుంటు వ్యాధిని సమూలంగా నశింపచేయడమే లక్ష్యంగా తమ సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు.

రుణ అర్హత కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ముప్పాళ్ళ: కౌలు రైతులు రుణ అర్హత కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,009 కార్డులు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,812 మందికి అందించామని పేర్కొన్నారు. అర్జీలను ఆయా గ్రామ వీఆర్వో లేదా వ్యవసాయశాఖ సిబ్బందికి అందించవచ్చని తెలిపారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



వరి నారు తీస్తున్న కూలీలు



నాటుకు ముందు తొలి పూజ చేస్తున్న కూలీలు



దమ్ము చేస్తున్న ట్రాక్టర్

వరివడిగా సాగు

ఊపందుకున్న వరి నాట్లు

సాగుకు నోచుకోని బీడు భూములు సాగుకు నోచుకుంటున్నాయి. కంప చెట్లు పెరిగి బీళ్లుగా మారిన పొలాలు పచ్చదనం పర్చుకోడానికి ముస్తాబవుతున్నాయి. సాగర్ కాల్వలకు నీటి రాకతో పల్నాట ఖరీఫ్ సాగు ఊపందుకుంది. సాగు కష్టనష్టాలు ఎలా ఉన్నా రైతన్నలు పొలం కోసం ప్రాణం పెట్టి శ్రమిస్తున్న శ్రమ జీవనం నిలువెల్లా కన్పిస్తోంది. పది రోజులుగా నాట్లు ప్రారంభమయ్యాయి. కాల్వలకు నీటి విడుదలతో మరో 10 రోజుల్లో ముమ్మరం కానున్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో 95 వేల ఎకరాల దాకా వరి సాగు జరగనుంది. ట్రాక్టర్ దమ్ము చేస్తే గంటకు రూ.1,500, నాటు వేస్తే ఎకరాకు రూ.5 వేలు ప్రస్తుతం పలుకుతున్న రేట్లు. వారం రోజుల్లోనే నాటు రూ.4,500 నుంచి రూ.ఐదు వేలకు పెరిగింది. నాటు వేసేటప్పటికి ఎకరాకు రూ.20 వేలు కానుండడంతో రైతులు పెట్టుబడుల అన్వేషణలో ఉన్నారు. వరి సాగు కోలాహలం నెలకొంది. – కారెంపూడి



వరి నాటు వేస్తున్న కూలీలు

ఒప్పిచర్లలో అదుపులోకి రాని డయేరియా

సోమవారం ఏడు కేసులు నమోదు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ప్రబలిన డయేరియా ఇంకా అదుపులోకి రాలేదు. సోమవారం కూడా మూడు కేసులు కారెంపూడి పీహెచ్‌సీకి వచ్చాయి. వారిలో ఇద్దరిని నరసరావుపేటలోని జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. మరొకరు గురజాలలోని ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మరో నాలుగు మైల్డ్ కేసులు కూడా బయట పడ్డాయి. మైల్డ్ కేసులు స్థానిక వైద్యశాలలో సేవలు పొందుతూ కోలుకుంటున్నారు. గత 5వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రతి రోజూ గ్రామంలో డయేరియా కేసులు బయట పడుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 17 మంది అధికారిక లెక్కల ప్రకారం డయేరియా బారిన పడ్డారు. మరో 25 దాకా మైల్డ్ కేసులు వచ్చాయి. వారిలో వంకాయలపాటి సత్యం అనే వ్యక్తి మృత్యువాత పడ్డారు. గ్రామంలో వైద్య శిబిరం 12వ తేదీ నుంచి కొనసాగుతూనే ఉంది. తాగు నీటి కాలుష్యం వల్ల డయేరియా వస్తోందని రిపోర్ట్స్ వచ్చాయని, తర్వాత కలుషిత, నిల్వ ఉన్న మాంసాహారం తీసుకోవడం కారణాలుగా కన్పిస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. దానికి తోడు గ్రామంలో పారిశుద్ధ్యం కూడా చాలా అధ్వానంగా ఉంది. దోమలు బాగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామం మధ్యలో పారుతున్న కలుషిత ఇసుక వాగు నీరు బోర్లలో ఇంకడం వల్ల బోర్లలో నీరు కలుషితం అవుతోందని భావిస్తున్నారు. నివాసాల మధ్యనే దిబ్బలు, విపరీతంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, చెరువు గట్లపై ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. పారిశుద్ధ్య చర్యలు మెరుగు పర్చడంతో పాటు వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేస్తూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం కన్పిస్తోంది.



గ్రామంలో కొనసాగుతున్న వైద్య శిబిరం



రోగిని నరసరావుపేట తరలిస్తున్న దృశ్యం

దాచేపల్లి ఎంపీపీగా జాను నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా పరిషత్ అధికారులు

దాచేపల్లి : మండల పరిషత్ అధ్యక్షుడిగా సారంగపల్లి అగ్రహారం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కందుల జాను నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శోభారాణి సోమవారం ఎంపీపీ జానుకి అందజేసి సన్మానించారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్ మందపాటి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీపీ జానుని సన్మానించారు.

◆ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీపీ కందుల జాను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సాధారణ వ్యక్తిగా ఉన్న తాను ఎంపీపీ స్థాయికి వచ్చేందుకు ఎంతోమంది తోడ్పాటు అందించి ప్రోత్సహించారని, ఈ పదవికి వన్నెతెచ్చేలా పని చేస్తానని అన్నారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై చర్చిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా సమర్థవంతంగా పనిచేస్తానని తెలిపారు.



జానుకు నియామక పత్రం అందించి సన్మానిస్తున్న జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో శోభారాణి

దేవరంపాడులో ఉచిత పశువైద్య శిబిరం

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం సోమవారం నిర్వహించారు. ఎదకు రాని 40 గేదెలకు పరీక్షలు చేసి, 12 తిరగ పార్లే పశువులను గుర్తించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ జి.వీరయ్య మాట్లాడుతూ గేదెలు ఈనిన తర్వాత 40 రోజుల నుంచి 90 రోజుల లోపే ఎదకు వచ్చేలా సరైన యాజమాన్య పద్ధతలను అనుసరించాలన్నారు. దీంతో ప్రతి ఏడాది ఒక దూడను పొందవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కె.నాగేశ్వరరావు(మొక్కపాడు), డాక్టర్ ఎం.పుల్లారెడ్డి(మాదల), సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, పశువైద్య సిబ్బంది ఆదినారాయణ, తేజ, అణుకు, రమ్య, కిరణ్, ఇందు రైతులు పాల్గొన్నారు.



గేదెలకు చూడు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వీరయ్య

యువకుడి ఉసురు తీసిన క్షణికావేశం

బొల్లాపల్లి: నాగార్జునసాగర్ ప్రధాన కుడికాలువలో యువకుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. బండ్లమోటు ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రావులాపురం గ్రామానికి చెందిన యలగాల వెంకటేశ్వర్లు (20) క్షణికావేశంలో కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 17వ తారీకు రాత్రి బస్సులో వినుకొండ నుంచి రావులాపురం వెళ్తూ మార్గమధ్యంలోని మూగచింతలపాలెం వద్ద ఉన్న కాలువలో దూకినట్లు మృతుడి తండ్రి యలగాల మన్నెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. రెండు రోజుల పాటు కుటుంబ సభ్యులతో పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మండలంలోని సంగినీడుపాలెం సీతారామపురం తండా పరిసర ప్రాంతంలోని ఎస్ఎస్‌పీ కుడి కాలువలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. యలగాల మన్నెయ్యకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. వీరిలో కుమారుడు వెంకటేశ్వర్లు మృతితో కుటుంబం రోదనలు మిన్నంటాయి. కుటుంబానికి ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటున్నాడని, వినుకొండ పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. క్షణికావేశంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



వెలికితీసిన యువకుని మృతదేహం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ముప్పాళ్ళ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన వారిలో నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామానికి చెందిన తెలగొర్ల వంశీ(17) అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుందురువారిపాలెంలో మిత్రుడు ఇంట్లో జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు వచ్చి, మాదల గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి మిత్రులతో కలిసి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాం...మేమేం పాపం చేశామని దేవుడు మాకీ శిక్ష విధించాడయ్యా అంటూ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ఆదిలక్ష్మీ రోదస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

కంటెపూడిలో తాడు లారీ బోల్తా

సత్తెనపల్లి: తాడు లారీ బోల్తా కొట్టిన ఘటన మండలంలోని కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం జరిగింది. సత్తెనపల్లి పట్టణం నుంచి తాడు లారీ పేరేచర్ల వెళ్తోంది. కళాశాల వద్ద ఒక్కసారిగా డ్రైవర్ బ్రేక్ వేయడంతో లారీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ప్రాణాపాయం జరగలేదు. డ్రైవర్ తో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే మరో లారీలోకి తాడు బస్తాలను ఎక్కించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చేశారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు వివరాలు సేకరించారు.

గులాబీరంగు పురుగు నివారణకు చర్యలు

ఏడీఏ వి.హనుమంతరావు



క్రోసూరు: పత్తి రైతులందరూ గులాబీ రంగు పురుగు నివారణకు సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం మండలంలోని పీసపాడు గ్రామంలో పత్తి రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తెలియజేశారు. ఎకరాకు నాలుగు నుంచి ఎనిమిది లింకార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రైకో గ్రామా పరాన్న జీవులు అందుబాటులో ఉన్న చోట ఎకరాకు 60 వేల చొప్పున మూడు విడతలుగా వారం రోజుల వ్యవధిలో విడుదల చేయటం వల్ల గుడ్ల దశలో ఉన్న పురుగును నివారించవచ్చునన్నారు. నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఆర్వో రామచంద్రయ్య, వీఆర్ఏ రాజశేఖర్, వీఏఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలి

మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల గ్రామాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి పలు సూచనలు చేసి మాట్లాడారు. ఈ–క్రాప్ బుకింగ్‌ను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. మండలంలో ఈ ఏడాది 24,872 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారని ఇప్పటి వరకు సుమారు 1,802 ఎకరాలలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు వీఆర్వోలు సంయుక్తంగా ఈ–క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వలన రైతులు, కౌలు రైతులు పంటల బీమా నగదు, పండించిన పంటలు అమ్ముకోవడం, బ్యాంక్ రుణాలు, పంట నష్టపరిహారం, రైతు భరోసా వంటి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు, వెంకటేష్ తదితరులున్నారు.



రెంటాల గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి

గురజాల : పంట సాగు చేసే ప్రతి రైతు విధిగా ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో ఈ పంట నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పంట యాప్‌లో రైతు తమ పంటను నమోదు చేసుకుంటే రైతుకు ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా అందుతాయన్నారు. ప్రభుత్వం అందించే మద్దతు ధర, పంట బీమా, సున్నావడ్డీ రుణాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగితే నష్ట పరిహారం వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున రైతులందరూ విధిగా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకుని వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల కొరకు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకటేశ్వర్లు, వీఏవోలు అబ్దుల్లా, బాలకోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



ఈ పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో సంధ్యారాణి

నిందితులను కఠినంగా శిక్షించాలి

దాచేపల్లి : కోల్‌కతాలో డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి దాచేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాచేపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి పల్నాడు బలహీనవర్గాల సమాఖ్య, డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్ నుంచి ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ దాచేపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రాన్ని విగ్రహం వద్ద పెట్టారు. డాక్టర్‌పై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ కర్నాటి వరలక్ష్మి మాట్లాడుతూ.. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉన్న మహిళ డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేయటం దుర్మార్గమైన చర్య అని, ఈ హత్య వెనుక ఉన్న నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ శ్రీరామనేని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని, వైద్యులపై ఇటువంటి దాడులు చేయటం హేయమైన చర్య అని ఖండించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కనుమూరి విక్రాంత్, సత్యనారాయణరెడ్డి, సాయికర్ణ నిషాంత్, అలేఖ్య, రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న డాక్టర్లు

పీహెచ్‌సీకి బేబీ వార్మర్ అందజేత

రెంటచింతల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.35 వేల విలువైన బేబీ వార్మర్‌ను టీడీపీ నేతలు అందజేయడం అభినందనీయమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రెంటచింతలకు చెందిన టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ వై.రమేష్, నాయకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, ఆదూరి శివ, కట్టమూరి వాసు, సైదులు బేబీ వార్మర్‌ను పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని 44 వేల మంది ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్న పీహెచ్‌సీలో ప్రస్తుతం బేబీ వార్మర్ అవసరం ఉందని, అడిగిన వెంటనే నాయకులు ముందుకు వచ్చి అందజేయడం సంతోషకరమన్నారు. వైద్యశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా.. ఇంకా ఏమైనా అవసరమా అని నేతలు విచారించి సమస్యల పరిష్కారానికి చేయుతనందించడం ప్రశంసనీయమన్నారు. వివిధ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఒక మీటింగ్ హాలు కూడా నిర్మించేందుకు సహకరించాలని కోరగా.. నిర్మాణానికి అవసరమైన విరాళాలను సమకూర్చడానికి తాము కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో ఎ.ఆంజనేయులు, సిబ్బంది తదితరులున్నారు.



బేబీ వార్మర్‌ను అందజేస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో విఖనసాచార్య స్వామి వార్షిక జయంతి



విఖనసాచార్య స్వామికి పూజలు



డాక్టర్ వేణుగోపాలాచార్యుల దంపతులకు సత్కారం

సత్తెనపల్లి: శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీ విఖనసాచార్య స్వామి వారి వార్షిక జయంతి మహోత్సవం వికనస మండలి సత్తెనపల్లి డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, విష్వక్సేన పూజ, పుణ్యాహం అష్ట దిక్పాలక పూజ, నవ గ్రహ పూజ, ఆఘూరం, ఉపాకర్మ హోమం(ముంజ విడుపు), విశేష స్నపన, అలంకరణ ఆలయోత్సవం, విశేష పూజలు పూజారి వేదాంతం రమణా చార్యులు నిర్వహించారు. వికనస మండలి సత్తెనపల్లి డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా వేదాంతం ధన్వంతరి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గుడిపూడి తులసీకృష్ణ భట్ట, రొంపిచర్ల వాసుదేవమూర్తి, సెక్రటరీగా నల్లూరి శ్రీనివాసమూర్తి, ట్రెజరర్‌గా నారాయణ లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా గుంటూరు సురేష్, పరాశరం రాజశేఖర్, పరాశరం యువకిషోర్, తాళ్లూరి ఆంజనేయ ప్రసాద్, తాళ్లూరి వెంకటరమణ, గౌరవ సలహాదారుడిగా వేదాంతం శ్రీనివాసా చార్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పని చేసిన వేదాంతం రామకృష్ణమాచార్యులు, నూతన అధ్యక్షుడు వేదాంతం ధన్వంతరి విజయ్‌కుమార్, వైద్య రంగంలో విశేష సేవలందించిన డాక్టర్ పరాశరం వేణుగోపాలాచార్యులు, డాక్టర్ పరుచూరి తిరుమలాచార్యులను సత్కరించారు. అనంతరం క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన పరాశరం తేజ్ సాయి సుదర్శన్, అమరావతి మండలం మల్లాది గ్రామానికి చెందిన పరుచూరి ఇందీవర శ్యామ్‌కు విద్యార్థి ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు.